## హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

# విద్యాశాఖ సంచాలకుడి కార్యాలయం ముట్టడి

ఆదిలాబాద్ : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడి కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సంఘం కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ వర్తింపజేయాలని, 342 జీఓకు విరుద్ధంగా జారీచేసిన మెమోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న అడ్వికెన్సీ అనే పదాన్ని తొలగించాలని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు అడె పవన్‌నాయక్, వినోద్‌కుమార్, వూషన్న, భూమయ్య, జాడి మురళి తదితరులు పాల్గొన్నారు.

# మన్మద్‌ను సందర్శించిన శిక్షణ ఐఏఎస్ అధికారిణి

### మరుగుదొడ్ల నిర్మాణంలో వంద శాతం సాధించడంపై గ్రామస్థులతో ముఖాముఖి



మన్మద్(లోకేశ్వరం): మరుగుదొడ్ల నిర్మాణంలో వంద శాతం ఘనత సాధించిన లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామాన్ని శిక్షణ ఐఏఎస్ అధికారిణి వల్లూరి క్రాంతి రెడ్డి సందర్శించారు. జోరువానలో గ్రామానికి చేరుకున్న అధికారిణి ముందుగా పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గ్రామస్థులకు తను పరిచయం చేసుకుని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది.. అందుకోసం మీరు ఎవరెవరిని సంప్రదించారు.. నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా.. మీకు అధికారుల తరపున సాయం అందిందా..లేదా.. నిర్మాణ సమయంలో ఆర్థికంగా ఎదురైన ఇబ్బందులను ఎలా అధిగమించారు.. మహిళలు ఎంతవరకు సహకరించారు.. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారందరూ వాడుతున్నారా.. వాడని వారిని ఎలా ఒప్పించగలిగారు అనే విషయాలను నాయకులు, మహిళలు, యువకులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచి గొడిసెల వజ్ర, ఆమె భర్త శంకర్‌గౌడ్, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు,. అంగన్వాడీలు పై వివరాలన్నింటిని ఆమెకు వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో ముఖ్యంగా ఎదుర్కొన్న సమస్య బిల్లుల జాప్యమేనని, నిర్మాణం పూర్తయ్యాక ఆరు నెలల వరకు రూపాయి కూడా చెల్లించకపోవడంతో తామంతా ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించగా విషయం తెలుసుకున్న అప్పటి జిల్లా పాలనాధికారి జగన్మోహన్ చొరవ తీసుకుని బిల్లులు ఇప్పించారని, నిర్మించుకునేందుకు అప్పటి ఎంపీడీఓ గంగాధర్ తరచూ పర్యవేక్షిస్తూ మాలో ఆత్మవిశ్వాసం నింపారని వారు అధికారిణికి తెలిపారు. అనంతరం జోరువానలోనే కొన్ని ఇళ్లలోకి వెళ్లి మరుగుదొడ్లు వాడుతున్నారా.. పరిశుభ్రంగా ఉంచుకుంటున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ సాయిరాం, స్వచ్ఛభారత్ మిషన్ ప్రమోటర్ సుధీర్‌కుమార్, జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారి ఎజాజ్‌లున్నారు.

# ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి

### విద్యాశాఖ సంచాలకుడు కిషన్

ఆదిలాబాద్ : జిల్లాలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు కిషన్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా ఆ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు ప్రక్రియ మందకోడిగా సాగకుండా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 94శాతం నమోదును పూర్తిచేశామని ఈ నెల 25 తేదీ వరకు లక్ష్యం పూర్తిచేస్తామని జిల్లా సెక్టోరియల్ అధికారులు లస్మన్న, గజేందర్ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ శ్రీహరిబాబు, పలు మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.

# విజ్ఞాన తీరాలకు చేర్చేది పుస్తక పఠనమే

సిద్దిపేట : శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకొని పుస్తక సంపదను సొంతం చేసుకోవాలని ఓయూ గ్రంథాలయ శాస్త్ర ఆచార్యులు, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత విద్యలో సార్వత్రిక విద్యా వనరులు అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో విలువైన లక్షలాది గ్రంథాలను డిజిటలైజేషన్ చేయడంతో అందరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రంథాలయ నిర్వహణలో వస్తున్న మార్పులను నిర్వాహకులతో పాటు విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. నిరంతర పుస్తక పఠనం విజ్ఞాన తీరానికి చేరుస్తుందన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో గ్రంథాలయాల పాత్ర కీలకమైందన్నారు. సదస్సు నిర్వహణ కార్యదర్శి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాలంలో ఉన్న పుస్తక వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు సదస్సు నిర్వహించామన్నారు. అధ్యాపకులు డా. హరినాథశర్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ గ్రంథపాలకుడు రవి అంతర్జాల సహాయంతో గ్రంథాలయ వనరుల వినియోగంపై వివరించారు.

# బీడీ కార్మికులకు పీఎఫ్ అందేలా చూస్తాం

### తెరాస కార్మికవిభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్



శాంతినగర్ : బీడీ కార్మికులు రోజుకూలీ చేసుకొని జీవనం సాగించే వారని వారందరికీ భవిష్యనిధి (పీఎఫ్) అందేలా చూస్తామని తెరాస కార్మిక విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్ అన్నారు. జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన స్థానిక బీసీ సంఘ భవనంలో బీడీ కార్మిక మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకొని వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేకంగా రూ.1000 పింఛను అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలోనూ బీడీ కార్మికుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రంలో సుమారు 7లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలో ఎక్కువగా ఉన్నారన్నారు. బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న మిగితా సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. బీడీ కార్మికులు సైతం తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూ పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెరాస రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో తెరాస కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మంచె నర్సింలు, ప్రధాన కార్యదర్శి అల్లి నర్సయ్య, జోగు ఫౌండేషన్ ఛైర్మన్ జోగు ప్రేమేందర్, తెరాస పట్టణ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, వైద్య ఆరోగ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అనిల్ కమ్ము, బీడీ కార్మికుల జిల్లా అధ్యక్షురాలు బియ్యాల అనసూయ, ప్రధాన కార్యదర్శి మామిడాల జ్యోతి, నాయకులు బుట్టిశివకుమార్, గోలిశంకర్, గాజుల సురేందర్, మోహన్, నగేశ్, శ్రీపద్‌వార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం

### భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు



పెద్దశంకరంపేట : పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయడానికి తెరాస ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో హనుమాన్ విగ్రహావిష్కరణకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలో పెండింగ్‌లో ఉన్న పాలెంవాగు, కిన్నెరసాని ప్రాజెక్టులను పూర్తిచేసి 40 వేల ఎకరాలకు నీరందిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో ఐదు మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తిచేసి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించామన్నారు. గత ప్రభుత్వాలు 20 వేల ఎకరాలకు నీళ్లిస్తే దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రాజెక్టులను తెరాస ప్రభుత్వం పూర్తిచేసి 7 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఏర్పాట్లు చేస్తోందన్నారు. కరీంనగర్, సింగూర్‌లలో ఎత్తిపోతల పనులు పూర్తి చేయడంతో సకాలంలో వర్షాలు కురవకున్నా ఇప్పుడు మొదటి పంటకు నీళ్లివ్వగలుతున్నామన్నారు. చెరువుల ఆయకట్టు పరిధిలో వేల ఎకరాల్లో నాట్లు పడటం తెరాస ప్రభుత్వం సాధించిన ఘనత అని ఆయన కొనియాడారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజక వర్గంలో మంజీరా నదిపై ఉన్న ఐదు ఎత్తిపోతల పథకాలు నిలిచిపోతే వాటికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకొస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా 34 కొత్త ప్రాజెక్టులు చేపడితే వాటిలో ఒక్కటి కూడా పూర్తి చేయలేదని, కొత్తవాటిని పూర్తిచేయడమే కాకుండా పాత ప్రాజెక్టులకు పూర్వవైభవం తెచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రాష్ట్రగీత పారిశ్రామిక సంస్థ మాజీ ఛైర్మన్ రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జేకే-5 ఉపరితలగని నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఇల్లెందు : సింగరేణి జేకే-5 ఉపరితలగని నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని తెలంగాణ ఐకాస జిల్లా ఛైర్మన్ మల్లెల రామనాథం పేర్కొన్నారు. ఇల్లెందు జేకే-5ఉపరితల గని నిర్వాసితులు గత 5రోజుల నుంచి కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలు నిర్వహించి 5రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో శనివారం ఐకాస నాయకుడు రామనాథం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి సమస్యలు వివరించారు. గత 9సంవత్సరాలుగా నష్టపరిహారం చెల్లించకుండా సింగరేణి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీంతో స్పందించిన కలెక్టర్ తానే స్వయంగా సమస్య పరిష్కరిస్తామని తెలపడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. టీఐకాస నియోజక ఛైర్మన్ భూక్యా రవినాయక్, దిలీప్‌కుమార్, భరత్ పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కళ్యాణం

బీచుపల్లి : పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామి వారి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకొని శనివారం కోదండరామాలయంలో ఆలయ అర్చకులు నర్సింహమూర్తి వేద మంత్రోత్సరణల మధ్య, భాజ భజంత్రీలు, భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో పాలుపంచుకునేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పాటు శ్రావణ మాసం చివరి కావడంతో పాటు స్వామి వారి కల్యాణం కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి తరలి వచ్చారు. బీచుపల్లి భక్తులతో సందడి నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బీచుపల్లి, భక్తులు పాల్గొన్నారు.

# అనేక ఉద్యమాలతో తెలంగాణ సాధించుకున్నాం

### రాష్ట్ర బెవరేజస్ ఛైర్మన్ దేవీప్రసాద్



భద్రాచలం : తెలంగాణ ప్రజల ఉద్యమాల వల్లనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలంగాణ రాష్ట్ర బెవరేజస్ ఛైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. రాష్ట్ర టీఎన్‌జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేంద్రలతో కలిసి భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద గల చిత్రకూట మండపంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెరాస ప్రభుత్వం అన్ని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టిందని అన్నారు. భద్రాద్రిలోని ఆలయాన్ని దేశంలోనే అద్భుత ఆలయంగా తీర్చిదిద్దే పనులను త్వరలో ప్రారంభించబోతోందని అన్నారు. రాష్ట్ర విభజనలో కేంద్ర ప్రభుత్వం భద్రాచలంలోని 7 మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం బాధాకరమైన విషయమని అన్నారు.

కొందరు విమర్శకులు ప్రభుత్వాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారని, అభివృద్ధిని చూసి మాట్లాడాలని అన్నారు. రాష్ట్ర విభజనలో ఆంధ్రాలో కలిసిన తెలంగాణ ఉద్యో గులను తెలంగాణకు తీసుకొచ్చామని.. ఇంకా ఎవరైనా ఉంటే వారిని తెలంగాణకు తీసుకువ చ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. సెప్టెంబరు 1న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో భద్రాచలం టీఎన్‌జీవో అధ్యక్షుడు చల్లగుల్ల నాగేశ్వరరావు, కార్యదర్శి నరసింహా రావు, ట్రెజరర్ బాలకృష్ణ, నాగభూషణం ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పట్టుదలతో సాగితేనే లక్ష్య సాధన సులువు

### కుమురం భీం పాలనాధికారి చంపాలాల్

ఆసిఫాబాద్ : పట్టుదలతో సాగితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని విద్యార్థి మల్లేష్ నిరూపించారని పాలనాధికారి చంపాలాల్ పేర్కొన్నారు. స్థానిక పీటీజీ గురుకులంలో 10వ తరగతి చదువుతున్న మల్లేష్ దక్షిణాఫ్రికాలోని అత్యంత ఎతైన 5835 మీ.కిలిమంజారో పర్వతారోహణం చేసి ఆసిఫాబాద్‌కు చేరుకోవడంతో టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలికల గురుకులంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న పాలనాధికారి మాట్లాడుతూ అసాధ్యాన్ని సాధ్యం చేస్తూ పర్వాతారోహణం చేసి జిల్లా, రాష్ట్రానికే గొప్ప పేరు తెచ్చారన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి రావడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ మల్లేష్ ఆదివాసుల్లో చరిత్ర సృష్టించారన్నారు. పేదరికాన్ని లెక్కచేయ కుండా లక్ష్యం సాధించి అందరికి ఆదర్శంగా మారాడన్నారు. త్వరలో ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి సన్మానించేలా చూస్తామన్నారు. పర్వతారోహణం చేసి జాతీయ జెండా ఎగురవేసి ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలు ఏర్పాటు చేసి ఆదివాసులకు ఎనలేని గుర్తింపు తెచ్చారన్నారు. అనంతరం పాలనాధికారి, ఎమ్మెల్యే, పాఠశాల ఉపాధ్యాయులు, జాగృతి విద్యార్థి సంఘం, వివిధ సంఘాలు విద్యార్థి మల్లేష్‌ను, కుటుంబ సభ్యులను, గతేడాది రెనాక్ పర్వతారోహణ చేసిన విద్యార్థిని అంజలిని ఘనంగా సన్మానించారు. మిఠాయిలు తినిపించారు. అక్కడి నుంచి ఏఆర్ హెడ్‌క్వార్టర్ వద్ద ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విద్యార్థి మల్లేష్‌ను సన్మానించారు.

మల్లేష్ ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. మొదట మంచిర్యాలలో ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో కర్ణన్‌ను కలిశారు. అక్కడి నుంచి ఆసిఫాబాద్‌కు చేరుకోగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మల్లేష్‌కు ఘనస్వాగతం పలికారు. స్థానిక కుమురంభీం, అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఓపెన్ జీపుపై మల్లేష్, అమ్మానాన్నలు అర్జయ్య, పున్నక్క ఉపాధ్యాయులు ఎక్కి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక టీటీడబ్ల్యూఆర్‌జేసీలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ డా.ఈ.శంకర్, గిరిజన సంక్షేమ శాఖ ఆర్‌సీఓ రమేశ్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కనక యాదవరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంధం శ్రీనివాస్, కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల డీసీఓలు సత్యనారాయణ, గంగాధర్, కళాశాల, పాఠశాలల ప్రిన్సిపాళ్లు రాజారాం, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, వైస్ ప్రిన్సిపల్ ఉప్పలయ్య, పీడీ శ్రీనివాస్, పీఈటీ సారంగపాణి, స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూశన్న, జిల్లా అధ్యక్షుడు హేమంత్ షిండే, చైతన్య, గిరిజన నాయకులు పోచ్చయ్య, సిడాం శంకర్, జాగృతి విద్యార్థి సంఘ నాయకులు సాయి శ్రావణ్, నవీన్, మనీష్, కార్తీక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలమూరు - రంగారెడ్డి నిర్మాణంలో ఇష్టారాజ్యం

### భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్‌రెడ్డి



పాలమూరు : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం తన ఇష్టం వచ్చినట్లు నిర్మిస్తోందని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 2015-16లో రూ.35,200 కోట్లతో అంచనాలను ఆమోదించి ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. పంపింగ్ స్టేషన్లకు మొదట కేటాయించిన బడ్జెట్‌కు అదనంగా టెండర్లు పిలిచి పనులు చేస్తున్నారని, అందులో ఎక్కువ మొత్తంలో అవినీతి జరుగుతోందన్నారు. మొదట ఈ పథకాన్ని నిర్మించడానికి ప్రణాళికలను రూపొందించి, ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు వేసి దీనిని నిర్మించడానికి చర్యలు చేపట్టారు. కాని ఇప్పుడు పాలకులు మాట మారుస్తున్నారని ఆరోపించారు. అంచనాలు లేకుండా, డీపీఆర్ అనుమతి లేకుండా ప్రాజెక్టును ఎలా నిర్మిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కేటాయించిన మొత్తం కంటే ఎక్కువ కోట్ చేసి టెండర్లను పిలిచి గుత్తేదారులకు ఇష్టం వచ్చినట్లు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రశ్నించడానికి అవకాశం లేకుండా పోలీసు చట్టాన్ని అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ చట్టాలకు, పోలీసులకు తాను భయపడేది లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా సీఎం పాలన సాగిస్తున్నారని, ఇది దోపీడీ రాజ్యమా, దొంగల రాజ్యమా, పోలీసుల రాజ్యమా అని ఆయన ప్రశ్నించారు. నాటి ముఖ్యమంత్రి వై%ఎస్ఆర్ పాలనలో రూ.25, రూ.50 కోట్ల అవినీతి జరిగితేనే తాము శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీసేవారమని, కాని ఇప్పుడు వేల కోట్ల అవినీతి జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీఎంకు తప్పుడు నివేదికలను ఇస్తున్నారని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి పథకంలో జరుగుతున్న అవినీతిపై ఉద్యమాలకు సిద్ధమవుతామని, అవినీతికి సంబంధించిన అన్ని విషయాలపై తాడో పేడో తేల్చుకుంటానని చెప్పారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి, నాయకులు పడాకుల సత్యం, కాశన్న, రాజేందర్‌రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఇక కరెంటు కోతలు ఉండవు

## మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ : పట్టణాల్లో, గ్రామాల్లో ఇక కరెంటు కోతలు ఉండవని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి, మార్కెట్ యార్డులో దుకాణాల సముదాయాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలతో లోఓల్టేజీ సమస్య ఉండదని చెప్పారు. మంచిర్యాల జిల్లా జైపూరు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో జిల్లాకు కరెంటు సమస్య ఉండదన్నారు. అలూరు, వంజర్, పార్‌పెల్లిలలో విద్యుత్ ఉప కేంద్రాల పనులు మొదలయ్యాయని, సారంగాపూర్‌లో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేందుకు మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పంటల నిల్వల కోసం అన్ని మండలాల్లో గోదాంల నిర్మాణాలు పూర్తి చేయించామన్నారు. యాసంగిలో గతంలో ఎన్నడూలేని విధంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. దాదాపు కోటి మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.167 కోట్లు చెల్లించామన్నారు. నిర్మల్ మార్కెట్‌యార్డు ఆధునీకీకరణ కోసం రూ. 20 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు.

కార్యక్రమంలో తెరాస రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్, ఆర్డీవో ప్రసూనాంబ, తహసీల్దార్ శంకర్, మున్సిపల్ ఛైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు దేవేందర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొప్పుల శ్రీధర్, విద్యుత్, మార్కెట్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## విద్యుత్తు, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



దురాజ్‌పల్లి : బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్తు, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని దురాజ్‌పల్లి వద్ద లింగమంతులస్వామి గుడి ఆర్చి ఎదుట నూతనంగా నిర్మించనున్న బ్రాహ్మణుల సదనం భవనం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. తెలంగాణ సమాజంలో వివిధ సంస్కృతులు, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాలో బ్రాహ్మణ సదనం పేరిట భవనాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బ్రాహ్మణ సదనం ఏర్పాటుకు పట్టణానికి చెందిన వైద్యులు, విప్రహిత ఆధ్యాత్మిక సేవా సమితి సూర్యాపేట అధ్యక్షులు ఆదుర్తి రామయ్య సుమారు రూ. కోటి విలువ చేసే ఎకరం భూమిని విరాళంగా ఇవ్వడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. తొలుత భవన నిర్మాణం కోసం భూమిపూజ, శంకుస్థాపన చేశారు. అనంతరం విరాళంగా ఇచ్చిన విశాలమైన స్థలాన్ని పరిశీలించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ కేవీ.రమణాచారి, ఎమ్మెల్సీ పురాణం సతీష్, చకిలం అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ కె.సురేంద్రమోహన్, సర్పంచి జాటోతు అంబలీ, ఎంపీపీ కల్పగిరి యశోద, జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస గౌడ్, సూర్యాపేట పురపాలిక అధ్యక్షురాలు గండూరి ప్రవళిక, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఏవీ.రమణారావు, ఎంపీడీవో జె.వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల సంచికతో విద్యార్థుల్లో నైపుణ్యం

అయిజ : ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచురించే సంచికలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొదిస్తాయని, ఉత్తీర్ణతశాతం మెరుగుపడుతుందని సాంకేతిక విద్య పరిశోధన సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రమణకుమార్ పేర్కొన్నారు. మేడికొండ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆగస్టీన్ హైదరాబాదులో ఆయనను కలిసి మేడికొండ విజ్ఞాన కిరణం పాఠశాల సంచికను ఆయనకు అందజేశారు. సంచిక చదివిన అనంతరం ఆయన విద్యార్థులకు ఇలాంటి సంచికలు సమాజంలో వచ్చే మార్పులు, విజ్ఞానం అందిస్తాయని అభినందించారని ఆగస్టీన్ పేర్కొన్నారు.

# వ్యాధుల రహిత తెలంగాణగా మారాలి

## రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి



బాలానగర్ : తెలంగాణ వ్యాధుల రహిత రాష్ట్రంగా మారాలని... దీనికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డా.లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ మండలం హేమాజిపూర్ గ్రామంలో పర్యటించిన ఆయన డీఎంహెచ్‌వో డా.హరిశ్చంద్రారెడ్డి, జిల్లా మలేరియా అధికారి డా.శశికాంత్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంఆర్ టీకా కార్యక్రమం చేపట్టిందని, రాష్ట్రంలో 9 నెలల చిన్నారి నుంచి 15 ఏళ్లలోపు వయసుగల సుమారు 90 లక్షల మందికి మీజిల్స్, రుబెల్లా టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. 5 వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో వందశాతం పూర్తిచేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కృషిచేస్తోందన్నారు. జిల్లాలో 15 ఏళ్లలోపు పిల్లలు 4.15 లక్షల మంది ఉన్నారని, శుక్రవారం వరకు 20 శాతం మందికి రుబెల్లా టీకాలు వేశామని తెలిపారు. ఇప్పటి వరకు ఎక్కడా దుష్ప్రభావాలు తలెత్తలేదని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో పాటు, గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. టీకాలపై వస్తున్న అపోహలను వదలి తట్టు తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి తమ పిల్లలను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు విధిగా ఎంఆర్ టీకా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# విధులు సరిగ్గా నిర్వహించకుంటే ఉపేక్షించేది లేదు

# వైద్య కళాశాలకు త్వరలో పూర్తిస్థాయి సంచాలకుడి నియామకం

## డీఎంఈ డా.రమేశ్‌రెడ్డి వెల్లడి



మహబూబ్‌నగర్ : వైద్య కళాశాలతోపాటు జనరల్ ఆస్పత్రిలో వైద్యులు సరిగ్గా విధులు నిర్వహించకపోతే ఉపేక్షించబోమని వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డా.రమేశ్‌రెడ్డి అన్నారు. జనరల్ ఆస్పత్రితోపాటు ప్రభుత్వ వైద్య కళాశాలను ఆయన పరిశీలించారు. సరిగ్గా విధులు నిర్వహించని ఆచార్యులు, వైద్యుల వివరాలను తనకు పంపించాలని ఆదేశించానన్నారు. తిరిగి వారు వచ్చి చక్కగా పని చేస్తే అనుమతిస్తామని, లేదంటే కఠిన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు పూర్తిస్థాయిలో సంచాలకుడి నియామకానికి చర్యలు చేపట్టామని, త్వరలోనే కొత్త సంచాలకుడు వస్తారని అన్నారు. వైద్య కళాశాల పరిధిలో పని చేసే పొరుగు సేవల సిబ్బందికి వేతనాలు ఇచ్చామని, జనరల్ ఆస్పత్రిలో పని చేసేవారికి కొంత సమస్య ఉండడంతో ఇవ్వలేదని, వెంటనే నిధులు విడుదల చేస్తామని చెప్పారు. జిల్లా ఆస్పత్రి నుంచి జనరల్ ఆస్పత్రిగా మారిన నేపథ్యంలో సిబ్బంది కొరత, ఇతర సమస్యలు ఉండడం సహజమని అన్నారు. అయిదు సంవత్సరాలలోపు పూర్తిస్థాయిలో ఆస్పత్రిలో వసతులు కల్పిస్తామని చెప్పారు. వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రిలో పని చేసేందుకు సహాయ ఆచార్యుల నియామక ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. జనరల్ ఆస్పత్రికి కేటాయించిన సీనియర్ రెసిడెంట్‌లకు డిప్యుటేషన్ ఇవ్వబోమని, ఇక్కడే పని చేయాలని చెప్పారు. ఎనిమిది నెలలు జనరల్ ఆస్పత్రిలో పని చేసిన అనంతరం జిల్లా, ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసేందుకు నాలుగు నెలలు పంపిస్తామని అన్నారు. వైద్య సేవలు మెరుగుపడటంతో ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరిగిందని, దానికి తగినట్లుగా వసతులు కల్పిస్తామని చెప్పారు. కేసీఆర్ కిట్టు అమలు చేసిన తర్వాత కాన్పులు పెరిగాయని, ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో ఎంఐసీయూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రామా కేంద్రం కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అంతకంటే ముందు సీనియర్ రెసిడెంట్‌లతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలను పరిశీలించారు. ఎదిర గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న కళాశాల భవన పనులను పరిశీలించారు. జనరల్ ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో సమస్యలపై ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు డా,.రాంకిషన్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సునందిని, ఆర్‌ఎంవో డా.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# 7న ఖమ్మంలో జనసేన శిబిరం

## నగరానికి రానున్న పవర్‌స్టార్

ఖమ్మం: పూర్వ ఖమ్మం(ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం) జిల్లా జనసేన శిబిరం సెప్టెంబరు 7న ఖమ్మం నిర్వహించనున్నారు. నగరంలోని బైపాస్‌రోడ్డు పక్కన ఎంబీ గార్డెన్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయాలలో చురుగ్గా పాల్గొనాలన్న అభిలాష ఉన్న మేథావులు, యువతీ యువకుల కోసం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పవర్‌స్టార్ చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఎనిమిది ఉమ్మడి జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారందరికీ ఈ-మెయిల్, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా శిబిరం వివరాలు, సమయాన్ని జనసేన ప్రతినిధులు తెలియజేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు శిబిరం వేదిక వద్ద తమ పేరు నమోదు చేసుకొని జనసేన తలపెట్టిన యజ్ఞంలో పాల్గొనవచ్చన్నారు. ఈ వివరాలు మరోసారి తెలుసుకోవడానికి జనసేన ఫేస్‌బుక్ పేజీని చూడాలని పవన్‌కల్యాణ్ సూచించారు.

# తోటి కార్మికుల వితరణ

కొత్తగూడెం : అనారోగ్యంతో ఓ కార్మికుడు మృతిచెందగా ఆయన కుటుంబానికి తోటి కార్మికులు వితరణను అందించారు. పీవీకే-5 గనిలో పని చేస్తున్న బోది రామకృష్ణ క్యాన్సర్‌తో ఈ నెల 10న మృతి చెందాడు. ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి కార్మికులు రూ.లక్ష నగదును అందించారు. గని మేనేజర్ శ్రీనాథ్ గని ఆవరణలో ఏర్పాటైన కార్యక్రమంలో రామకృష్ణ కుటుంబ సభ్యులకు అందించారు.

కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ మనోజ్ కుమార్, పిట ఇంజినీర్ రాజబాబు, గుర్తింపు సంఘం నాయకులు చందర్, రాజయ్య, రాజయ్య, హబీబుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు వీరాస్వామి, సాంబమూర్తి, హెచ్‌ఎంఎస్ నాయకులు జయరాం, గంగాధర్, సీఐటీయూ నాయకులు విజయగిరిశ్రీను, రత్నం, ఐఎన్‌టీయూసీ నుంచి రమణయ్య, శ్రీరామ్, సంక్షేమాధి కారి అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలను ఆధునికీకరిస్తాం

## సంస్థ రాష్ట్ర ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్

మహబూబ్‌నగర్ : ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలను ఆధునికీకరించేందుకు కృషి చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్ వెల్లడించారు. మహబూబ్‌నగర్‌లోని కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్‌లు పూలబొకేలతో స్వాగతం పలికారు. అనంతరం గ్రంథాలయంలో పాఠకులను పలుకరించారు. అక్కడున్న పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో కూడా సొంత భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో రాంనగర్ లోని పాత గ్రంథాలయ ప్రాంతంలో కొత్త భవన నిర్మాణం కోసం కోల్‌కతాలోని శ్రీరాజారాం మోహన్‌రాయ్ ఫౌండేషన్ నుంచి రూ.52 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాలలో కొత్త భవనాలను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామీణ గ్రంథాలయాలను బలోపేతం చేయనున్నట్లు వెల్లడించారు. రాంనగర్‌లో కొత్త గ్రంథాలయం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపట్ల సంతోషం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు జయశ్రీ, యాదయ్య, మహేశ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

# చాకరిమెట్లలో విశేష పూజలు

చాకరిమెట్ల : చిన్నగొట్టిముక్ల గ్రామం చాకరిమెట్లలో శ్రీ సహకార ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాసం చివరి భక్తులు విశేష పూజలు చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారికి చందనాభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. శనిత్రయోదశి కావడంతో నవగ్రహాలకు తైలాభిషేకం నిర్వహించారు. వాహన పూజలు చేశారు. విశాలమైన సత్యనారాయణ స్వామి మండపంలో దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ ఆంజనేయశర్మ, ఈవో సార శ్రీనివాస్, ఆలయ ప్రధాన పూజారి దేవదత్తశర్మ, పూజారులు దేవీప్రసాద్ శర్మ, ప్రభురాజ శర్మ, చందు, జూనియర్ సహాయకులు శ్రీనివాసచారి, రామకృష్ణ ఉన్నారు.

# యాదాద్రిలో శ్రావణ సందడి



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో శ్రావణ సందడి నెలకొంది. మాసం ముగియనున్నందున పలు ప్రాంతాలకు చెందిన భక్తులు యాదాద్రీశుడిని దర్శించి మొక్కు పూజలు చేపట్టారు. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించి ఆశీస్సులు పొందారు. కుటుంబ సభ్యులతో వ్రతాలు చేపట్టిన భక్తులను పూజారులు ఆశీర్వదించారు. వేకువజాము 3 గంటల నుంచే ఆలయ కార్యక్రమాలు తెరకెక్కాయి. విశేష దినం కావడంతో పలు జిల్లాలకు చెందిన యాత్రికులు క్షేత్రాన్ని సందర్శించి హరి హరులను దర్శించారు. శ్రావణ మొక్కుల్లో భాగంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. నిత్యకార్యక్రమాల్లో భాగంగా శ్రీ స్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన ఆరాధనతో చేపట్టిన కల్యాణోత్సవంలో శ్రీ స్వామి అమ్మవార్లను అలంకరించి గజవాహనోత్సవాన్ని చేపట్టారు. మహామండపంలో సహస్రనామాలతో ఆరాధిస్తూ అష్టోత్తరం కొనసాగింది. పలుచోట్ల నుంచి వచ్చిన యాత్రికులతో ఆలయ వీధులు, మండపాలు రద్దీమయంగా మారాయి. ప్రసాదాల కొనుగోలుకు భక్తులు తిప్పలుపడ్డారు. మండపంలో జరిగే పూజలో పాల్గొనేందుకు భక్తులు బారాలు తీరాల్సి వచ్చింది. క్రమబద్ధీకరణ లేకపోవడంతో పిల్లాపాపలతో వచ్చిన భక్తులు సతమతమయ్యారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లకు ప్రభుత్వానిదే బాధ్యత

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిష్టారం ప్రాంతంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లకు మతతత్వ భాజపా ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, పోలీస్‌లదే బాధ్యతని దీన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలని సీపీఐ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ పేరున విలేకరులకు పంపిన ఓ పత్రికా ప్రకటనలో ఆరోపించారు. దోపిడీ భాజపా ప్రభుత్వం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు, ప్రజల శత్రువైన మడకం ముద్దరాజు నేతృత్వంలో కలిసిపోయి కిష్టారం చుట్టు పక్కల గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న అమాయక ప్రజలను పట్టుకెళ్లి అక్రమ కేసుల్లో ఇరికించి నరక యాతనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇళ్లల్లో చొరబడి చిత్రహింసలకు గురిచేసి హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల ఆగస్టు 13న రాత్రి 12 గంటల సమయంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు కిష్టారం ప్రాంతంలోని ఇత్తనపార అనే గ్రామంలోకి చొరబడి నిద్రిస్తున్న పొడియం సన్నా, వంజం ఉంగా అనే ఇద్దరు ఆదివాసీలను గాజులగట్ట అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యంత పాశవికంగా హత్య చేశారని ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిజం చేయడానికి మావోయిస్టులు చచ్చిపోయారని టీవీల్లో, మీడియాలో అసత్యప్రచారం చేశారని ఆరోపించారు. వీటిని ప్రజలందరూ ఖండించి వీరి కుటుంబాలకు మద్దతు తెలపాలని అన్నారు.

# శౌచాలయాల నిర్మాణం వేగిరం చేయండి

మెదక్ : పెండింగ్‌లో ఉన్న శౌచాలయాల నిర్మాణాలను వేగిరం చేసి, సెప్టెంబరు 15 వరకు బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని పాలనాధికారి భారతి శికెరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలతో స్వచ్ఛభారత్ ప్రాజెక్టుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో శౌచాలయాల నిర్మాణాలను వేగిరం చేయాలని, ఆ దిశగా అన్ని మండలాల ప్రత్యేకాధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకొని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాకు స్వచ్ఛభారత్ ద్వారా రూ. 24 కోట్లు మంజూరయ్యాయని, డబ్బులు సకాలంలో రావడం లేదని నిర్మాణాలు ఆలస్యం చేయడం సరికాదన్నారు. డబ్బులు సిద్ధంగా ఉన్నందున త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీలో కూలీలకు పని దినాలను పెంచాలని, ఇదివరకే మండలాలకు లక్ష్యాన్ని నిర్దేశించామని, అందుకనుగుణంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మండలాల్లో హరితహారం లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్డీవో సీతారామారావు, డీపీవో హనోక్, ఆర్డీవోలు నగేశ్, వెంకటేశ్వర్లు, మధు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను త్వరగా పూర్తి చేయాలని పాలనాధికారి భారతి శికెరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ గురించి రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ప్రాజెక్టు ఈపీటీఆర్ఐ సంస్థ ప్రతినిధులతో పాలనాధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన కాలువ జిల్లాలో 50 కి.మీ. మేర ఉంటుందని, జిల్లాలోని 16 మండలాలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుందన్నారు. ఆయా మండలాల్లో ప్రాజెక్టు నిర్మాణానికి భూమి ఎంతమేర అవసరం అవుతుందో వివరంగా పేర్కొనాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల కలిగే లాభాలు, గతంలో ఉన్న ఆయకట్టు, నిర్మాణం అనంతరం ఎంత విస్తీర్ణం సాగులోకి వస్తుందనే వివరాలను రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లాలో 13, 17, 18, 19, 22 దశల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని అధికారులు పాలనాధికారికి వివరించారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఈఈ ఏసయ్య, మత్స్యశాఖ ఏడీ లక్ష్మినారాయణ, డీఏవో పరశురాంనాయక్, ఆర్డీవోలు నగేశ్, మధు, వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ తనికేశ్ పాల్గొన్నారు.

